ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టార్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్‌ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు.ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ
ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లే, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లులో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఓప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సీఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో పీఆర్ఆర్ యూనిటీ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పుస్తకాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పుస్తకాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కాగా, రిటైర్డు హెచ్ఎం చల్లగురుగుల చలపతి గ్రంథాలయాన్ని సందర్శించి, పలు పుస్తకాలను నిర్వాహకుడు మడుగూరి నాగేశ్వర్‌రావుకు అందజేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి ఏవో రాజ్‌కుమార్, మడుగూరి రాజేశ్వర్‌రావు, మడుగూరి సుధాకర్‌రావు, నూతి రమేశ్, పాలకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్ పుతప్పి ఒకరు మృతి

మహాముత్తారం, అక్టోబర్ 7 : మండలంలోని యామన్‌పల్లి శివారు మూలమలుపు వద్ద సింగనేని సుందర్ (23) ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. కాటారానికి చెందిన సుందర్ యామన్‌పల్లి ప్రధాన కూడలిలో కూరగాయల అమ్ముతుంటాడు. సోమవారంరాత్రి మహాముత్తారం నుంచి యామన్‌పల్లికి వస్తుండగా మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి అక్కడే ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. ఘటనలో ముఖం, తలపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

'బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మించాలి'

ములుగురూరల్, అక్టోబర్ 7 : మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగుపై డ్యామ్‌ను నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. కన్నాయిగూడెంలో జరిగిన పార్టీ గ్రామ శాఖ ఎన్నికలో ఆయన పాల్గొని మాట్లాడారు. బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మిస్తే 20 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. డ్యామ్ సాధించే వరకూ ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాసం రమేశ్, సహాయ కార్యదర్శిగా ధనసరి సారంగపాణి, సభ్యులుగా పాయం నీలక్క, పాయం పాపయ్య, దబ్బకట్ల బాబు, దబ్బకట్ల లక్ష్మయ్య, పాయం స్వామి, దనసరి సాంబయ్య, దబ్బకట్ల రవి, యాట రఘు, యాట సహదేవ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి జీపీ వర్కర్ మృతి

మహాముత్తారం, అక్టోబర్ 7 : మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్, పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కౌటం వెంకటస్వామి(52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రాజయ్య కథనం ప్రకారం.. వెంకటస్వామి వ్యవసాయం చేసుకుంటూ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులెవరూ తన మాట వినడంలేదని కోపంతో శనివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆయన పత్తి చేనులో చనిపోయి ఉన్నాడు. భార్య కౌటం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముమ్మరంగా మిర్చి మొక్క పాతు పనులు

వాజేడు, అక్టోబర్ 7 : మండల వ్యాప్తంగా మిర్చి సాగు జోరందుకుంది. ఈ ఏడాది దాదాపు 6 నుంచి 7వేల ఎకరాల్లో మిర్చి పంటను వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి పాతు పనులు ఉపందుకున్నాయి. పాతు వేసిన చోట మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మళ్లీ మిర్చి మొక్కలు వేసేందుకు అవసరమైన మిర్చినారును కొనుగోలు చేస్తున్నారు. 341 రకం మిర్చినారు ఒక్కటి రూ.2 వెచ్చిస్తుండడంతో నారు అమ్మకందారులకు డిమాండ్ ఏర్పడింది.



చేనులో నాటిన మిర్చి పాతులు

కాల్వలు లేక పాఠశాల ముందు భాగంలో చేరిన మురుగునీరు

నీటితో బొమ్మనపల్లి-ప్రగళ్లపల్లి గ్రామాల మధ్య రహదారి

బొమ్మనపల్లి గోడు వినేదెవరు?

- **అధ్వానంగా గ్రామ రోడ్లు, డ్రైనేజీ**
- **పిచ్చి మొక్కలతో క్రీడా ప్రాంగణం**
- **అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు సొంత భవనం కరువు**

వాజేడు, అక్టోబర్ 7 : ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ, ఆ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోడంలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమస్యలపై విన్నవిస్తే పెడచెవిన పెట్టారే తప్పా పరిష్కారానికి దారి చూపలేదు. ఎన్నో ఏండ్లుగా సరైన వసతులు లేక ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామ ప్రజలు మండల కేంద్రానికి వెంకటాపురం నుంచి వెళ్తే 40 కిలోమీటర్లు ఉంటుంది. అలా కాకుండా ప్రగళ్లపల్లి గ్రామం నుంచి అడవి మార్గంలో 4 కిలోమీటర్లు రోడ్డు వేస్తే పది కిలోమీటర్లు ప్రయాణిస్తే వాజేడుకు చేరుకోవచ్చు. లేదా ఎడ్జర్లపల్లి, వెంకటాపురం మీదుగా వాజేడుకు వెళ్లాలంటే సుమారు 35 కిలో మీటర్లు వస్తున్నది. గ్రామస్తులు మాత్రం తక్కువ దూరం ఉన్న అడవి మార్గంలో రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్నారు. దీనిని నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అడ్డుతగులుతున్నారని తెలుస్తున్నది. మట్టి దారి కావడంతో వర్షాకాలంలో 108 వాహనం కూడా వచ్చే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రం నుంచి వాహనాల్లో రావాలన్నా వెళ్లాలన్నా 40 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నదని చెప్తున్నారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వీధుల్లో మురుగు ప్రవహించి వ్యాధుల బారిన పడుతున్నామని

పిచ్చి మొక్కలతో క్రీడా ప్రాంగణం

గ్రామస్తులు వాపోతున్నారు. చెత్త పేరుకుపోయి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం నిర్వహణ సరిగా లేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థలకు చేరడంతో దానిని కూల్చి వేసి ఇప్పటి వరకు నిర్మించిన దాఖలాలు లేవు. దీంతో పాఠశాల వద్ద ఉన్న భవనంలో కేంద్రం నిర్వహణ కొనసాగుతున్నది. అలాగే మండలంలోని మొరుమురు, ప్రగళ్లపల్లి, వెంకటాపురం మండలంలోని బర్లగూడెం, రామవరం, చిరుతపల్లి గ్రామాల నుంచి సైతం రైతులు వ్యవసాయం కోసం ప్రగళ్లపల్లి మీదుగా బోమన్నపల్లి గ్రామం వరకు అడవి మార్గంలోని కాలిబాటన రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి పూట పరిస్థితి చెప్పలేనిది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రగళ్లపల్లి, బొమ్మనపల్లి మార్గంలో రహదారి వేయాలి

ప్రగళ్లపల్లి నుంచి మా గ్రామానికి అడవిలో కాలిబాట ఉంది. దానిని రహదారిగా మార్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోడంలేదు. మట్టి దారి కావడంతో వర్షాకాలం ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకొని పరిష్కరించాలి.

– బానారి సత్యనారాయణ

డ్రైనేజీలు, సిమెంట్‌రోడ్లు వేయాలి..

గ్రామంలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నం. మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు వేయాలి. యువకులు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణంలో మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించాలి. ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వాసం సత్యం, గ్రామస్తుడు

నిలిచిన బతుకమ్మ చీరల పంపిణీ

మంగపేట అక్టోబర్ 7 : బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని 25 పంచాయతీల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో భద్రు, ఎంపీవో శ్రీకాంత్, ఇతర ప్రత్యేక అధికారుల చేతుల మీదుగా సోమవారం మొదలైన చీరల పంపిణీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. మళ్లీ చీరల పంపిణీ ఈనెల 15 నుంచి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, చీరెల పంపిణీ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో మహిళలు నిరాశకు గురయ్యారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

చిట్యాల,(మొగుళ్లపల్లి), అక్టోబర్ 7 : మండలకేంద్రం శివారు పెద్దవాగు పరీవాహక గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని భారతీయ కిసాన్ సంఘం మొగుళ్లపల్లి మండల qధ్యక్షుడు పులి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఇసుక అక్రమంగా రవాణా చేయడమే కాకుండా పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో ఇసుక డంపులు చేసినట్లు సోమవారం తహసీల్దార్ సునీతకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల(మొగుళ్లపల్లి), అక్టోబర్ 7 : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ సోమవారం తెలిపారు. మొగుళ్లపల్లి మండలం రంగాపూర్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు ట్రాక్టర్లు ఇసుకను టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట వాగు నుంచి పట్టణానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ ఓనర్లు టేకుమట్ల మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎండీ చాంద్‌పాషా, గజ్జి రమేశ్, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎం అనిల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

రేగొండ, అక్టోబర్ 7 : గుడుంబా స్థావరాలపై దాడులు చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బాగిర్దిపేటలో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సైతో పాటు ట్రైనీ ఎస్సైలు దివ్య, హేమ సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. గుడుంబా స్వాధీనం చేసుకొని శ్రీపతి సాంబాలక్ష్మి, శ్రీపతి సురేశ్, పరిదల సీతపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకత చర్యలకు పాల్పుడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై హెచ్చరించారు.

దసరాకు ఊరెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

మంగపేట, అక్టోబర్ 7 : దసరా పండుగ సందర్భంగా ఊరెళ్లే వారి నివాసాల్లో చోరీలు జరిగే అవకాశాలున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై టీవీఆర్ సూరి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని సూచించారు. సీసీ కెమెరాలు ఉంటే ఇంటర్ నెట్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. పోలీసుల సెల్ నంబర్లు సేవ్ చేసుకోవాలని, అవసరాన్ని బట్టి 100కు డయల్ చేసి సహాయం పొందాలన్నారు.

ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షుడిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కారదర్శిగా ప్రేమ్‌కుమార్, కోశాధికారిగా అశోక్, కార్యదర్శులుగా కుడుముల దీపక్, సీతబోయిన వెంకటేశ్, కమిటీ సభ్యులుగా శ్రీహరి, తరుణ్, కిశోర్, సీతారాం, నరేందర్, విజయ్, అజయ్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు అతిథులుగా వరంగల్ రే